క్లుప్తంగా

డీఎస్పీ విచారణ



గ్రామస్తులను విచారిస్తున్న డీఎస్పీ రవీందర్

మేడిపెల్లి: బీమారం మండలం రంగాపూర్ గ్రామంలో శనివారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు విచారణలో భాగంగా డీఎస్పీ రవీందర్ రెడ్డి విచారణ చేపట్టారు. అదే గ్రామానికి చెందిన అరికిల్ల తిరుమలేశ్ ఫిర్యాదు మేరకు కేసు విచారణలో భాగంగా డీఎస్పీ బాధితునితో పాటు గ్రామస్తులను విచారించారు.

ఆలయంలో పూజలు



ఎమ్మెల్యేను ఆశీర్వదిస్తున్న పూజారులు

కోరుట్లరూరల్: మండలంలోని మాదాపూర్ గ్రామంలోని రాజరాజేశ్వర స్వామి ఆలయంలో జాతర ఉత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. కాగా ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఉత్సవాల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.

మహిళలు అవకాశాలను సృష్టించుకోవాలి



విద్యార్థులతో ప్రిన్సిపాల్ సత్యనారాయణ

జగిత్యాల: మహిళలు అవకాశాలను సృష్టించుకోవాలని మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ సూచించారు. ఈ మేరకు శనివారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వేడుకలు నిర్వహించారు. ఐక్యూఏసీ కోఆర్డినేటర్ హర్‌జ్యోత్‌కౌర్, కోఆర్డినేటర్ జ్యోతిలక్ష్మి, మహిళా సాధికారత విభాగం సమన్వయ కర్త స్వరూపరాణి, సత్యప్రకాశ్, రహీం, చంద్రయ్య, కిరణ్మయి, మానస, రజిని, జమున పాల్గొన్నారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు



పనులను పరిశీలిస్తున్న కమిషనర్

మెట్‌పల్లి: పారిశుధ్య పనుల విషయంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు పట్టణంలోని పలు వార్డుల్లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పారిశుధ్య పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తను, కాల్వల్లో పూడికను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరు చేసి ఇచ్చేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

బస్టాండ్లలో చలివేంద్రాలు ఏర్పాటు



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఆర్టీసీ అధికారులు

ఇబ్రహీంపట్నం: మెట్‌పల్లి డిపో పరిధిలోని అన్ని గ్రామాల్లోని బస్టాండ్లలో ఎండ తీవ్రత పెరుగుతున్నందున ప్రయాణికుల సౌకర్యార్థం చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని మెట్‌పల్లి డిపో సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జీపీ సింగ్ తెలిపారు. ఈ మేరకు శనివారం మండలకేంద్రంలోని బస్టాండ్ వద్ద చలివేంద్రాన్ని సర్పంచ్ నేమూరి లతతో కలిసి ఆయన ప్రారంభించారు. ఆర్టీసీ సేఫ్టీ వార్డెన్ ప్రభాకర్, సీఆర్‌సీ సురేశ్, కార్గో ఎగ్జిక్యూటివ్ ఉపేందర్, నాయకులు నేమూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఎర్రాపూర్, డబ్బా గ్రామాల్లోని నర్సరీలను, క్రీడా ప్రాంగణాల పనులను, ఉపాధిహామీ పనులను ఎంపీడీవో ప్రభు శనివారం పరిశీలించారు. ఈ మేరకు ఎర్రాపూర్‌లో ఉపాధిహామీ పనులు జరగకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా సోమవారం నుంచి ఉపాధి హామీ పనులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డబ్బా గ్రామంలో బృహత్ పల్లెప్రకృతి వనంలో రోడ్డు పనులు పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాణి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

సాహిత్య సేవలో రాస భూమయ్య

- 18 పుస్తకాల రచనలతో గుర్తింపు
- 1986లో ఎవరి సొత్తు పుస్తకావిష్కరణ
- 27 ఏళ్లుగా తెలుగు సాహితీ ప్రయాణం
- 7 ఏళ్లుగా 'స్వేచ్ఛ' సంస్థ సేవలు
- అనేక అవార్డులు, పురస్కారాలు అందుకున్న కవి



కలెక్టర్ రవి చేతులమీదుగా ఉత్తమ కవి, దసరా పురస్కారం అందుకుంటున్న రాస భూమయ్య (ఫైల్)

కోరుట్లటౌన్: తెలుగు సాహిత్యరంగంపై ఎంతో ఇష్టంతో నిరంతర కృషి చేస్తూ మాస్టర్‌గా, కవిగా, సామాజిక సేవకునిగా ఎఖీన్‌పూర్‌కు చెందిన రాస భూమయ్య గుర్తింపు సాధించారు. కోరుట్ల పట్టణం పక్కనే ఉన్న ఎఖీన్‌పూర్ గ్రామంలోనే ప్రయివేటు పాఠశాల స్థాపించి 26 ఏళ్లు ఎంతో మంది విద్యార్థులకు పాఠాలు చెప్పారు. 27 ఏళ్లుగా తెలుగు సాహితీ ప్రయాణంలో సామాజిక అంశాలతో 18 పుస్తక రచనలు చేసి, 14 పుస్తకాలు ఆవిష్కరించారు. ఆర్టీసీ కండక్టర్‌గా 18 ఏళ్లు పనిచేసి స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. రాస భూమయ్య సేవలకు విజయవాడ మానస సాహిత్య సాంస్కృతిక అకాడమీ జాతీయ పురస్కారం, తెలంగాణ అవతరణ ఉత్సవాలలో ఉత్తమ సాహితీ వేత్తగా, 75వ స్వాతంత్ర్య వేడుకల్లో ఉత్తమ కవిగా దసరా పురస్కారం అందుకున్నారు.

సండే స్పెషల్

సాహితీ అడుగులు..

గ్రామీణ ప్రాంత పరిసరాలలో సమాజంలో చూస్తున్న సంఘటనలతో ప్రేరణ పొంది, సాహిత్య రచనలు మొదలు పెట్టాడు. పదే పదే మాట్లాడటం కన్నా ఆ మాటలకే అక్షర రూపం ఇవ్వాలనే తపనతో 1986లో విద్య ఎవరిసొత్తు (నాటిక) పుస్తకావిష్కరణ చేశారు. ఇలా ఒక్క పుస్తకంతో మొదలైన ప్రస్థానం మరో 17 పుస్తకాలు పూర్తి చేశారు. కవి మేధావులు డాక్టర్ అందె వెంకట్ రాజం, శ్రీగాదె శంకర కవి, డింగరి రమాచారి, వోటారి చిన్నరాజన్న కవి, బైరి నర్సయ్య కవి, బీఎస్.రాములు కవి, పోతుగంటి భూమగౌడ్ ఆదరణ ఫలితంగా కవి సమ్మేళనాలలో తనదైన శైలితో ఎన్నో కవితా రచనలు చేసి ఆకట్టుకున్నారు. సామాజిక స్పృహ, భారతీ సాహిత్య సమితి వేదికగా మేధావులు, కవుల కలయికతో తన కలానికి మరింత పదును పెట్టి ఎక్కువగా పుస్తక రచనలు చేశారు.

సామాజిక సేవలు..

ప్రతి ఒక్కరూ చదువుకోవాలనే సంకల్పం దిశగా గ్రామీణప్రాంత వాసులను చదువు బాట పట్టించారు. విద్యాసంస్థ నడిపిస్తూ ఆనాడు పెద్దలకు రాత్రి బడులు, అక్షర ఉజ్వల ప్రభుత్వ కార్యక్రమానికి తోడ్పాటుగా నిలిచారు. కోరుట్ల మండలంలో 15 గ్రామాలు దత్తత తీసుకొని, 100 కేంద్రాలలో విద్య నేర్పించేందుకు ఎనలేని కృషి చేశారు. రాస భూమయ్య కృషిని మెచ్చుకొని అప్పటి కలెక్టర్ బన్వర్‌లాల్ సన్మానించారు.

అవార్డులు- పురస్కారాలు..

- 2009లో మానస సాహిత్య సాంస్కృతిక అకాడమీ విజయవాడ సంస్థ రాస భూమయ్య రాసిన కవితను ఉత్తమ కవితగా ఎంపిక కాగా, జాతీయ పురస్కారం అందుకున్నారు.
- 2015లో తెలంగాణ అవతరణ సందర్భంగా ఉత్తమ సాహితీవేత్తగా కలెక్టర్ కృష్ణ భగవాన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.
- 75వ స్వాతంత్ర్య వార్షికోత్సవాల సందర్భంగా ఉత్తమ కవిగా కలెక్టర్ గుగులోతు రవి చేతుల మీదుగా దసరా పురస్కారం–2022 అందుకున్నారు.



జాతీయ పురస్కారం అందుకుంటున్న రాస భూమయ్య (ఫైల్)



రాస భూమయ్య రాసిన పుస్తకాలు

'స్వేచ్ఛ' సాహిత్య సామాజిక సేవా సంస్థ స్థాపన..

2016లో స్వేచ్ఛ సామాజిక సాహిత్య సామాజిక సేవ సంస్థ స్థాపించి కవులను, కళాకారులను, సామాజిక సేవకులను గుర్తించి, ప్రోత్సాహం అందిస్తున్నారు. 7 ఏళ్లుగా కోరుట్ల పరిసర ప్రాంతాల్లో చక్కటి సభా కార్యక్రమాలు నిర్వహిస్తూ, అందరి ఆదరాభిమానాలు పొందుతున్నారు. ఒకవైపు సాహితీ రచనలతో గుర్తింపు సాధించినప్పటికీ మరోవైపు సమాజానికి నిరంతరం సేవలు కొనసాగించడం అభినందనీయం.

భవనానికి నిధులు మంజూరు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న విశ్రాంత ఉద్యోగులు

కొడిమ్యాల: మండల విశ్రాంత ఉద్యోగుల భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను విశ్రాంత ఉద్యోగుల మండల అధ్యక్షుడు భూమారెడ్డి, సెక్రటరీ వెంకట్ రెడ్డి, నారాయణ, నర్సయ్య శనివారం కలిసి వినతిపత్రం సమర్పించారు.

అమలుకు నోచుకోని ఎన్నారై పాలసీ



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ధర్మపురి: గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ఎన్నారై పాలసీ అమలు చేస్తామని గతంలో బీఆర్‌ఎస్ ఇచ్చిన హామీలు ఏమయ్యాయని గల్ఫ్ సేవా సమితి కొస్నూర్‌పల్లె సభ్యులు ప్రశ్నించారు. ఈ మేరకు శనివారం స్థానికంగా ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. గల్ఫ్ బాధితుల సమస్యల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఎన్నారై పాలసీ జెండా ఆవిష్కరించారు. ప్రభుత్వం స్పందించి రూ.500కోట్లతో ఎన్నారై పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సర్పంచ్‌లు కుడికల మహేశ్, కోస్న లక్ష్మీరెడ్డి, ఎంపీటీసీ కుంట సుధాకర్, నాయకులు గంగారాం, లచ్చన్న, రవీందర్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు నిలిపివేయాలి

మెట్‌పల్లి: పట్టణంలోని బీడీ కాలనీలో కొత్తగా నిర్మించిన అపార్ట్‌మెంట్ వద్ద ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్ పనులను నిలిపివేయాలని కాలనీవాసులు శనివారం కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ట్రాన్స్‌ఫార్మర్‌తో ఆ ప్రదేశంలో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని తెలిపారు. వెంటనే పనులను నిలిపివేసి నిబంధనల ప్రకారం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే పల్లెనిద్ర



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సంజయ్

రాయికల్: 'ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకే మీ గ్రామానికి వచ్చి మీతో ఉంటూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టాం' అని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం రాత్రి మండలంలోని కట్కాపూర్ గ్రామంలో 'మీరు నేను' కార్యక్రమంలో భాగంగా పల్లెనిద్ర కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, సర్పంచ్ రాజమౌళి, నాయకులు ఆంజనేయులు, గంగాధర్, ధర్మారాజు, రాజరెడ్డి, బట్టు రంజిత్ పాల్గొన్నారు.

రూ.500 కోట్లతో కళాశాల ఏర్పాటు

జగిత్యాల: జిల్లా కేంద్రంలో రూ.500 కోట్లతో కళాశాల భవనం నిర్మాణం జరుగుతోందని, ఇది జగిత్యాలకే ఐకాన్ అని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని బస్ డిపో వద్ద రూ.11.15 కోట్లతో మెడికల్ కళాశాల చుట్టూ రహదారుల అభివృద్ధిలో భాగంగా నిర్మిస్తున్న నాలుగు లైన్ల బీటీరోడ్డుకు శంకుస్థాపన చేశారు. మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, శ్రీలత, రాజ్‌కుమార్, రాంచందర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ డబుల్‌బెడ్రూం ఇళ్లు

పట్టణంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న నూకపల్లి డబుల్‌బెడ్రూం ఇళ్లను అర్హులైన లబ్ధిదారులందరికీ అందజేస్తామని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం జగిత్యాల అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో డబుల్‌బెడ్రూం ఇళ్ల ఎంపిక ప్రక్రియను, ఎంపిక విధానాన్ని పరిశీలించారు. మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, తహసీల్దార్ రవీందర్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ శనివారం పలువురికి కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్ ఉన్నారు.

అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్య సిబ్బందికి సన్మానం

మల్యాల: మండలంలోని మద్దుట్ల, ఒబులాపూర్ గ్రామాల్లో శనివారం మహిళా దినోత్సవ సంబరాలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్య సిబ్బందిని సన్మానించారు. సర్పంచులు పొన్నం సరోజన–మల్లేశం, కెల్లెటి మల్లమ్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజశ్రీ, హెల్త్ సూపర్‌వైజర్ పి.సునంద, అంగన్‌వాడీ టీచర్లు అనురాధ, స్వరూప, జలజ, విజయ, ఏఎస్‌ఎం లక్ష్మి, పుష్ప, కవిత పాల్గొన్నారు.

సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి

జగిత్యాలజోన్: మహిళలు తమకు ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని ఐసీడీఎస్ సీడీపీవో వీరలక్ష్మి అన్నారు. ఈ మేరకు జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ర్యాలీ, సమావేశం నిర్వహించారు. సఖి రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సఖి అధికారి అశ్విని, సర్పంచ్ చెరుకు జాన్, ఎంపీటీసీ సునీత, సూపర్‌వైజర్ జానకి, సీపీ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦వీధి కుక్కలతో జాగ్రత్తగా ఉండాలి

మెట్‌పల్లి: వీధి కుక్కలతో ప్రజలు, చిన్నారులు జాగ్రత్తగా ఉండాలని మున్సిపల్ శానిటేషన్ విభాగం ఇన్‌చార్జి గుర్రం రత్నాకర్ కోరారు. ఈ మేరకు పట్టణంలోని జయ కాన్వెంట్, శాంకరీ మోడల్ స్కూల్, కార్తికేయ స్కూళ్లలో శనివారం మున్సిపల్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది ముజీబ్, నిజాం, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

✦స్టడీ స్కిల్స్‌పై విద్యార్థులకు అవగాహన

పెగడపల్లి: మండలంలోని నామాపూర్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు వెక్టార్ అకాడమీ ఆధ్వర్యంలో స్టడీస్కిల్స్‌పై రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించారు. వెక్టార్ అకాడమీ ట్రైనర్ శ్రావణి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన శిక్షణ ముగింపు సమావేశంలో సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, హెచ్‌ఎం మల్లికార్జున్ మాట్లాడుతూ వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఇలాంటి శిక్షణ జీవితంలో ఉపయోగపడుతాయన్నారు. ఉప సర్పంచ్ సంతోష్ పాల్గొన్నారు.

✦ఉత్తమ ఫలితాలు సాధించాలి

మల్లాపూర్: ఎస్సెస్సీ పరీక్షల్లో కస్తూర్బా, జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈవో భీమయ్య ఆకాంక్షించారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కేజీబీవీలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం హైదరాబాద్‌లోని చిలుకూరి బాలాజీ ఆలయ అర్చకులు ఆత్మారాం సురేశ్ అందించిన పెన్నులను విద్యార్థులకు అందజేశారు. మల్లాపూర్ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం అనిత, కేజీబీవీ ప్రిన్సిపాల్ శ్రీలత ఉన్నారు.

✦ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచండి

కథలాపూర్: గ్రామాల్లో ఉపాధిహామీ పథకం పనుల్లో కూలీల సంఖ్య పెంచేందుకు ఫీల్డ్ అసిస్టెంట్లు చొరవ చూపాలని ఎంపీడీవో జనార్దన్ ఆదేశించారు. ఈ మేరకు శనివారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఏపీవో రాజేందర్ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి పర్యటన విజయవంతం చేయండి

కథలాపూర్: మండలంలోని కలిగోట శివారులోని సూరమ్మ ప్రాజెక్టును పరిశీలించేందుకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆదివారం వస్తున్నారని, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో తరలివచ్చి పర్యటన విజయవంతం చేయాలని పీసీసీ కార్యవర్గసభ్యుడు తొట్ల అంజయ్య కోరారు.

✦బాల్య వివాహాలను అరికట్టాలి

రాయికల్: బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సఖి కేంద్రం కౌన్సిలర్ గౌతమి కోరారు. ఈ మేరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బాల్య వివాహాల నియంత్రణ, మహిళల సంక్షేమం కోసం వివిధ రకాలతో రూపొందించిన టోల్‌ఫ్రీ నంబర్ల గురించి అవగాహన కల్పించారు. కౌన్సిలర్లు సువర్ణ, అన్వరిబేగం, ఏఎస్‌ఎం భాగ్యలక్ష్మి, ఫాతిమా పాల్గొన్నారు.

కనుల పండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాయికల్: మండలంలోని ఇటిక్యాల గ్రామంలో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అర్చకులు జగన్‌మోహనచార్యుల ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ సామల్ల లావణ్య, ఎంపీటీసీ కొమ్ముల రాధ, సింగిల్‌విండో చైర్మన్ మహిపతిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు బోడుగం మల్లయ్య, సురకంటి నాగిరెడ్డి, చిన్న లింబాద్రిగౌడ్, శ్రీనివాస్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

మహిళల హక్కులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న చైల్డ్‌లైన్ అధికారి

కోరుట్ల, కోరుట్లరూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు హేమలత, ప్రేమలత పాల్గొన్నారు.

సంగెంలో..

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక పాఠశాలలో మహిళల హక్కులపై మహిళలకు శనివారం అవగాహన కల్పించారు. చైల్డ్‌లైన్ 1098 అధికారి ఆరుట్ల రజిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షెమీమ, ఉపసర్పంచ్ శనిగరపు సాగరిక, హెచ్‌ఎం సరళ, అంగన్వాడీ కార్యకర్తలు రజిత, విజయ లక్ష్మి, సీఏ వినోద పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ధర్మపురి: పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న నిరుపేద అనాథ విద్యార్థులకు అదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు ఆర్థికసాయం అందించారు. పాఠశాలకు చెందిన శిరీష్, హరీష్ అనే విద్యార్థులకు రూ.10,500 శనివారం అందజేశారు. హెచ్‌ఎం రాజన్న, టీచర్లు గొల్లపల్లి గణేశ్, రావులపెల్లి శ్రీనివాస్, స్వప్న, స్వర్ణకుమారి ఉన్నారు.

పేద ప్రజల కోసమే వైద్య శిబిరాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

కోరుట్ల: నియోజకవర్గంలోని పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే ఉద్దేశంతోనే తన కుమారుడు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ల బృందంతో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. పేదలకు ఉచితంగా టెస్టులు, చికిత్సలు, వైద్యం అందిచడం కోసమే తన కుమారుడు డాక్టర్ సంజయ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాడని పేర్కొన్నారు. గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ నిజామాబాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వైద్య శిబిరాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ పవన్, ఎంపీపీ తోట నారాయణ, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, ఉపాధ్యక్షుడు గుడ్ల మనోహర్, నిజామాబాద్ మెడికల్ సూపరింటెండెంట్ ప్రతిమ, వైద్యులు హేమంత్, ఫౌండేషన్ నిర్వాహకులు, వైద్యులు చిన్నబాబు పాల్గొన్నారు.

వంటగ్యాస్ ధర పెంపుపై కాంగ్రెస్ నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

మెట్‌పల్లి: కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధర పెంచడాన్ని నిరసిస్తూ పట్టణంలో కాంగ్రెస్ నాయకులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. పార్టీ కార్యాలయం వద్ద కట్టెల పొయ్యి మీద వంట చేస్తూ నిరసన తెలిపారు. అనంతరం పలువురు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వ హయాంలో పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. కౌన్సిలర్ యామ రాజయ్యతో పాటు ఎర్రోల హన్మాండ్లు, కటకం గంగారెడ్డి, పెంట ప్రణయ్, రజాక్, కంతి హరికుమార్, పల్లికొండ ప్రవీణ్, బర్ల అర్జున్, విమల్, బర్ల వంశీ, మహేశ్ పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి



ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

వెల్గటూర్: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని బీఆర్‌ఎస్ మండల నాయకులు శనివారం వెల్గటూర్ మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్యాస్ ధర పెంపుతో సామాన్యులపై అదనపు భారం పడుతుందని, ఇష్టానుసారం ధరలు పెంచుతూ సామాన్యుల నడ్డి విరుస్తున్నారని ఆరోపించారు. ఏఎంసీ చైర్మన్ పత్తిపాక వెంకటేశ్, పీఏసీఎస్ చైర్మన్ గోలి రత్నాకర్, మండల అధ్యక్షుడు రాంచంద్రం, ప్రధాన కార్యదర్శి కుమార్, సర్పంచులు విద్యాసాగర్, రవి, తిరుపతి, రమేశ్, నాయకులు భరత్, రామస్వామి పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం ఏర్పాటుపై గ్రామస్తుల హర్షం

బుగ్గారం: బీర్‌సాని గ్రామానికి రోడ్డు వేసిపట్టినప్పటికీ అధికారులు బస్సు సౌకర్యం మాత్రం కల్పించలేకపోయారు. ఈ మేరకు తమ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు అధికారులకు విన్నవించారు. ఈ నేపథ్యంలో ఇటీవల పలువురు గ్రామస్తులు మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కలిసి సమస్య విన్నవించారు. స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి జగిత్యాల నుంచి అనంతారం, గుట్రాజుపల్లి, గంగాపూర్, బీర్‌సాని, వెల్గటూర్ వరకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా శనివారం పలువురు బీర్‌సాని గ్రామస్తులు బస్సు ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి ఈశ్వర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ కారకూరి రాధ, శ్రీనివాస్, రామస్వామి, సత్తయ్య, భూమయ్య, బుచ్చయ్య, పురుషోత్తం, చందు పాల్గొన్నారు.

పన్ను బకాయిదారులకు నోటీసులు



నోటీసులు ఇస్తున్న మున్సిపల్ సిబ్బంది

కోరుట్ల: పట్టణంలో ఇంటిపన్ను బకాయిదారులకు మున్సిపల్ సిబ్బంది శనివారం నోటీసులు అందజేశారు. ఏళ్ల తరబడి బకాయిలు పేరుకు పోయిన ఇంటి యజమానులకు 7 రోజుల్లో బకాయిలు చెల్లించాలని నోటీసుల్లో పేర్కొన్నారు. అత్యధికంగా ఇంటిపన్ను రూ.4.25లక్షల బకాయి ఉన్న విపంచి చిట్‌ఫండ్ యాజమాన్యానికి నోటీసులు ఇచ్చారు. కార్యక్రమంలో బీసీఎస్ నర్సింహులు, అశోక్, మదన్, జగదీష్, ఆర్ఐ శ్రీకాంత్, ఆర్‌వో తిరుపతి పాల్గొన్నారు.